## క్లుప్తంగా

### అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

### బ్రహ్మకుమారీస్ ఆధ్యాత్మిక బోధన



తీరంలో బ్రహ్మకుమారీస్ ఆధ్యాత్మిక బోధన శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీఐ మల్లికార్జునరావు

పరవాడ: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ముత్యాలమ్మపాలెం తీరంలో ప్రజాపిత బ్రహ్మకుమారీస్ వాడచీపురుపల్లి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక బోధ శిబిరాన్ని పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శివుడు జ్యోతి స్వరూపడని, శివనామ స్మరణం సర్వపాప హరణం అని పేర్కొన్నారు. పుణ్య స్నానాలు ఆచరించడానికి వచ్చిన భక్తులకు శివుని బోధనలను బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు వివరించి, కరపత్రాలు, ప్రసాదం పంచిపెట్టారు. కార్యక్రమంలో పరవాడ ఎస్ఐ కృష్ణారావు, బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు సోమేశ్వరమ్మ, అప్పారావు, ప్రభాకరమూర్తి, ఆదిలక్ష్మి, విజయలక్ష్మి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

### బెల్ట్ దుకాణంపై దాడి

- 18 మద్యం బాటిళ్ల స్వాధీనం, వ్యక్తి అరెస్ట్



పెందుర్తి: జీవీఎంసీ 88వ వార్డు పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని గవర జగ్గయ్యపాలెంలో ఓ బెల్ట్ దుకాణంపై పోలీసులు గురువారం సాయంత్రం దాడి చేశారు. అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న కోళ్లపల్లి కాసుబాబును అదుపులోకి తీసుకుని, అతడి వద్ద అమ్మకానికి సిద్ధంగా ఉన్న 18 క్వార్టర్ బాటిళ్లను మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

### 3న కోదండరామాలయ వార్షికోత్సవం



కోట్నివానిపాలెం కోదండరాముడు

పెందుర్తి: మండలంలోని కోట్నివానిపాలెంలో కొలువుదీరిన సంపత్ వినాయక పూర్వక, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సహిత సీతాకోదండరాముల ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని మార్చి 3(సోమవారం)న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.నా రోజు ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన చేయనున్నట్లు పేర్కొన్నారు. వార్షికోత్సవంలో భాగంగా సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ప్రజలంతా వేడుకలో పాల్గొని, కోదండరాముని అన్న ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సింహాచలం: గోశాల, ఆర్‌టీసీ కాంప్లెక్స్ ఫీడర్ల పరిధిలో సాధారణ తనిఖీల్లో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకి అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ విశాఖ జోన్–3 ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. దీంతో ప్రహ్లాదపురం, శ్రీనివాసనగర్, గోశాల జంక్షన్, సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్, సాయినగర్, ప్రియాగార్డెన్స్, టీవీ టవర్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

**అంతకాపల్లి పరిధిలో..**

సబ్బవరం: మండలంలోని సబ్బవరం సెక్షన్–2, అంతకాపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో ప్రీ మాన్‌సూన్ వర్క్స్ కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఈపీడీసీఎల్ ఈఈ రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సబ్‌స్టేషన్ పరిధిలోని అంతకాపల్లి, రావలమ్మపాలెం, టెక్కలిపాలెం, నాయనమ్మపాలెం, రాయపుర అగ్రహారం, ఆరిపాక, బంగారమ్మపాలెం, అడ్డూరు, గొటివాడ, లగిశెట్టిపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

---

- మండుతున్న ఎండు గడ్డి ధరలు
- ట్రాక్టర్ ఎండు గడ్డి రూ.15-17 వేలు
- పరవాడలో భారంగా మారిన పశుపోషణ

# పశుగ్రాసం కొరత..
# పాడిరైతు దీనావస్థ



ముత్యాలమ్మపాలెం పచ్చిక బీడులో గడ్డి మేస్తున్న పశువులు



నా పేరు రాళ్లపల్లి పైడినాయుడు. మాది నాయుడుపాలెం. పాడి పశువుల పెంపకంపైనే మా కుటుంబం ఆధారపడి జీవిస్తోంది. గతంలో 10 పాడి గేదెలు ఉండేవి. ప్రస్తుతం పశుగ్రాసం కొరత కారణంగా 5 పాడి గేదెలనే **పోషిస్తున్నాం.** వీటి పోషణ కూడా తలకు మించిన **భారంగా** మారింది. ట్రాక్టర్ ఎండు గడ్డిని రూ.**15 వేలకు** కొనుగోలు చేసి, పశువుల్ని కాపాడు**కుంటున్నాం.** అధిక ధరలు వెచ్చించి పశు గ్రాసాన్ని **కొనుగోలు** చేయడం కష్టంగా ఉంది. ప్రభుత్వం **ఎలాంటి** రాయితీలు ఇవ్వట్లేదు.

| మండలంలో జీవాలు | |
|---|---|
| గేదెలు | 5,279 |
| ఆవులు | 3,333 |
| గొర్రెలు | 4,370 |
| మేకలు | 928 |



పరవాడలో విక్రయానికి నిలిపిన ఎండుగడ్డి ట్రాక్టర్లు



ఎండుగడ్డిని కొనుగోలు చేసి తన స్థలానికి తీసుకువచ్చిన రైతు

పరవాడ: రియల్ ఎస్టేట్ వ్యాపారం**తో వంట పొలాలు** వ్యాపారుల పరమై.. సాగు విస్తీర్ణం **తగ్గుతోంది. దీంతో** పాడి రైతులు పశువులకు కడు**పు నిండా గ్రాసం** పెట్టలేని దుస్థితి పరవాడ మండల**ంలో నెలకొంది.** ఒకప్పటి పంట భూములు రియల్టర్ల **చేతికి చేరి,** వాటి చుట్టూ కంచెలు ఏర్పడ్డాయి. పంటలు సాగు చేయకపోవడంతో ఎండు గడ్డికి కొరత ఏర్పడింది. ఉన్న కాస్త భూములకూ కంచెలు వేయడంతో పచ్చగడ్డికి పశువులు వెతుకులాడే పరిస్థితి. పచ్చగడ్డి కానరాక, ఎండు గడ్డి దొరక్క పాడి రైతులు పశుపోషణకు నానా యాతనలు పడుతున్నారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్న పాడి రైతులు, పశువుల్ని ఏదో ఓ ధరకు అమ్ముకుని, కూలి పనులకు పోతున్నారు. పశుపోషణ తప్ప, మరో దారి తెలియని రైతులు మాత్రం అధిక ధరలకు ఎండు గడ్డిని కొనుగోలు చేసి, జీవాలను సంరక్షించుకుంటున్నారు.

**ఎండు గడ్డికి భారీ డిమాండ్**

ఎండు గడ్డికి గతంలో ఎన్నడూ లేనంత డిమాండ్ నెలకొంది. దీంతో ధరలు గణనీయంగా పెరిగాయి. స్థానికంగా దొరికే అవకాశం లేకపోవడంతో పొరుగు జిల్లాల నుంచి కొనుగోలు చేసుకుని, ట్రాక్టర్ల ద్వారా తీసుకొస్తున్నారు. తూర్పు గోదావరి జిల్లా కాకినాడ, పిఠాపురం, శ్రీకాకుళం జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వస్తున్న ఎండు గడ్డి ధరలు భారీగా పెరిగాయి. మూడు ఎడ్ల బళ్లకు సరిపోయే ట్రాక్టర్ ఎండు గడ్డి ధర రూ.15 వేలు నుంచి రూ.17 వేలు వరకు పలుకుతోంది. కాకినాడ నుంచి వస్తున్న ట్రాక్టర్ వరి గడ్డి రూ.15 వేలుండగా, శ్రీకాకుళం నుంచి వస్తున్న ట్రాక్టర్ ఎండు గడ్డి ధర రూ.17 వేలు పలుకుతోంది. శ్రీకాకుళం వరి గడ్డి నాణ్యత ఆధారంగా అధిక ధర పలుకుతోంది. ఈ రెండు జిల్లాల నుంచి ఎండు గడ్డిని యలమంచిలి, అచ్యుతాపురం, పరవాడ ప్రాంతాలకు చేర్చి, ఇక్కడి నుంచి రైతులు కొనుగోలు చేసుకుని, తమ ప్రాంతాల్లో నిల్వ చేసుకుని పశువుల దాణాగా వినియోగించుకుంటున్నారు.

**ప్రభుత్వ ని'బంధనాలు'**

రానున్న మండు వేసవిలో పశు పోషణ రైతులకు మరింత కష్టంగా మారనుంది. పాడి రైతులకు అవసరమైన పశుగ్రాసాన్ని సరఫరా చేసేందుకు ప్రభుత్వమే చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ఈ ఏడాది మండలంలో 30 ఎకరాల విస్తీర్ణంలో పశుగ్రాస క్షేత్రాలను అభివృద్ధి చేయాలని ప్రతిపాదించినా.. ప్రభుత్వం విధించిన నిబంధనల కారణంగా రైతులు ముందుకు రావట్లేదు. పశువులున్న రైతు 10 సెంట్ల నుంచి 50 సెంట్ల సొంత భూమితో పాటు బోరు, ఉపాధి హామీ పథకం కార్డు తప్పనిసరి. అలా అయితేనే పాడిరైతుకు పశుగ్రాసం పెంచేందుకు ప్రభుత్వం రూ.30 వేలు మంజూరు చేస్తుంది. ఈ ని'బంధనాల'తో చాలా మంది పాడి రైతులు ప్రభుత్వ రాయితీలను పొందలేకపోతున్నారు. మరోవైపు ఈ పథకం అమల్లో ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు కూడా పెద్దగా దృష్టి సారించట్లేదు. దీంతో చాలా మంది రైతులకు ఈ పథకం ఉందన్న అవగాహన కూడా లేని పరిస్థితి.

**ప్రభుత్వమే సరఫరా చేయాలి**



పశువులను పోషించుకుంటున్న రైతులకు రాయితీపై ఎండు గడ్డిని సరఫరా చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. సొంత పొలం ఉన్న రైతులందరికీ సొంత బోరుండే పరిస్థితి లేదు. అందువల్ల పశుగ్రాస క్షేత్రాలతో రైతులకు ఎలాంటి ప్రయోజనం నెరవేరదు. పంటలు సాగు చేస్తున్న రైతుల నుంచి వరి గడ్డిని కొనుగోలు చేసి, సబ్సిడీపై ప్రభుత్వమే సరఫరా చేస్తే మేలు జరుగుతుంది.

– కూండ్రపు సోమినాయుడు, వాడచీపురుపల్లి

**పశుగ్రాస క్షేత్రాలకు దరఖాస్తులు**



ప్రభుత్వం పాడి రైతుల కోసం అమలు చేస్తున్న పశుగ్రాస క్షేత్రాల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకునేందుకు రైతులు ముందుకు రావాలి. రైతుకు 50 సెంట్ల సొంత స్థలం, బోరు, ఉపాధి హామీ జాబ్ కార్డు, ఆధార్, బ్యాంకు అకౌంట్‌తో ఎన్ఆర్ఈజీఎస్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తులు పరిశీలించి రైతు పశుగ్రాసం వేయాల్సిన భూమిని బట్టి ఎస్టిమేషన్ వేసి, అనుమతులు మంజూరు చేస్తారు.

– డాక్టర్ రామకృష్ణ కీర్తి, ఏడీ, పశు సంవర్ధకశాఖ, పరవాడ

### నేడు మెగా వైద్యశిబిరం

పెందుర్తి: సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పెందుర్తి నాలుగు రోడ్ల కూడలి వద్ద శుక్రవారం మెగా వైద్య శిబిరం, మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ వ్యవస్థాపకుడు దాడి శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి ఉచిత వైద్య శిబిరంలో సాధారణ పరీక్షలతో పాటు గుండె సంబంధిత పరీక్షలు, కంటి పరీక్షలు, దంత పరీక్షలు, మహిళల గైనిక్ సమస్యలపై పరీక్షలను వైద్య నిపుణులు నిర్వహిస్తారన్నారు. దాతలు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేసి, ప్రాణదాతలు కావాలని కోరారు.

### పేరుకుపోయిన చెత్తాచెదారం



వాడచీపురుపల్లి సాయిబాబా మందిరం వద్ద పేరుకుపోయిన చెత్త కుప్ప

పరవాడ: వాడచీపురుపల్లి సాయిబాబా మందిర పరిసరాలు చెత్తాచెదారంతో నిండుకుని, అధ్వానంగా మారాయని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంతో పవిత్రంగా పూజించే సాయిబాబా మందిరం ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచాల్సిన స్థానికులు, ఇలా చేయడం సరికాదని ఆక్షేపిస్తున్నారు. పరిసరాల్లో నివాసం ఉంటున్న ప్రజలు తమ ఇళ్లలోని చెత్తచెదారాన్ని మందిరం వద్ద డంప్ చేయడంతో, భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. చెత్తకుప్పలు పేరుకుపోయి, భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. పంచాయతీ అధికారులు కూడా మందిరం సమీపంలో డస్ట్‌బిన్‌ను ఏర్పాటు చేయకపోవడంపై భక్తులు ఆక్షేపిస్తున్నారు. ఆరు బయట వేసిన చెత్తను రోజుల తరబడి తొలగించకుండా పారిశుధ్య సిబ్బంది తాత్సారం చేస్తుండటంతో ఇళ్లలో ఉండలేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారు. భక్తులు ఎదుర్కొంటున్న అసౌకర్యాన్ని గుర్తించి, మందిరం వద్ద డస్ట్‌బిన్ ఏర్పాటు చేయడంతోపాటు, ఎప్పటికప్పుడు చెత్తను తరలించేలా చూడాలని కోరుతున్నారు.

## ఎగసిపడుతున్న దుమ్ము, ధూళితో ఇబ్బందులు



లంకెలపాలెం కూడలిలో భారీ వాహనాలతో ఎగసిపడుతున్న దుమ్మూధూళి

పరవాడ: పరవాడ–లంకెలపాలెం రహదారిలో భారీ వాహనాల కారణంగా ఎగసిపడుతున్న దుమ్ము, ధూళితో నానా ఇబ్బందులు పడుతున్నామని గ్రామీణ ప్రజలు వాపోతున్నారు. హిందూజా, ఎస్ఈజెడ్ పరిశ్రమలకు బొగ్గు, సింహాద్రి ఎన్టీపీసీ నుంచి బూడిదలను తరలించే భారీ వాహనాలు రహదారిలో అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నాయి. వీటి నుంచి ఎగసిపడే దుమ్ముతో రోడ్డంతా బూడిద పేరుకుపోతోంది. ఆ ధూళిని పీల్చడం వలన తీవ్ర అనారోగ్య సమస్యలకు గురవుతున్నామని ప్రజలు వాపోతున్నారు. లారీలు వలన ఎగసిపడుతున్న దుమ్ము కారణంగా ఎదురెదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రోడ్ల పక్కన ఏర్పాటు చేసుకున్న చిన్న చిన్న పాన్‌షాపులు, కిరాణా షాపులు, టీ, టిఫిన్ సెంటర్లు ధూళితో నిండిపోతున్నాయి. భారీ వాహనాల రాకపోకలతో రోడ్లు ధ్వంసమై, ప్రమాదాలు జరుగుతున్నాయి. దీని నియంత్రణకు అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

**అలసిన మనసుకు.. ఐస్ బాక్సే హంసతూలిక**



నిద్ర సుఖమెరగదు.. ఆకలి రుచెరగదు అన్నది నానుడి. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏటా ఆర్కే బీచ్‌లో భారీగా కార్యక్రమాలు జరుగుతాయి. ఇక్కడికి వచ్చే నగరవాసులకు ఉపయుక్తంగా తాత్కాలికంగా పలు దుకాణాలను విక్రేతలు ఏర్పాటు చేసుకుంటారు. పిల్లలను సైతం వెంటబెట్టుకుని పొట్టకూటి కోసం వస్తుంటారు. అలా వచ్చిన ఓ కుటుంబంలోని చిన్నారి అలసి పక్కనే ఉన్న ఐసు డబ్బాపై నిదురించాడు. తల్లిదండ్రులు పక్కనే వస్తువులు విక్రయిస్తూ నాలుగు డబ్బులు సంపాదిస్తున్నారు. అలసిన చిన్నారి ఐసు పెట్టెపై నిద్రపోగా.. తమ్ముడికి తోడుగా పక్కనే సోదరి నిలుచుని ఉంది. ఈ దృశ్యం 'సాక్షి' క్లిక్ మనిపించింది.

– ఏయూ క్యాంపస్

## ఎమ్మెల్సీ 'పోలింగ్' ప్రశాంతం



గాదె శ్రీనివాసులునాయుడుకు మద్దతుగా ఏర్పాటు చేసిన శిబిరంలో బీజేపీ నాయకులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు



ఎమ్మెల్సీ అభ్యర్థి రఘువర్మకు మద్దతుగా శిబిరంలో గండి బాబ్జీ, టీడీపీ నాయకులు



పెందుర్తి పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్న ఉపాధ్యాయులు

- నియోజకవర్గంలో 89.85 శాతం పోలింగ్
- గాదెకు మద్దతుగా బీజేపీ శిబిరం
- రఘువర్మకు మద్దతుగా టీడీపీ, జనసేన శిబిరం
- చివరి నిమిషం వరకూ ప్రలోభాల ఎర

పెందుర్తి/పరవాడ: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక ప్రక్రియలో భాగంగా గురువారం నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. నియోజకవర్గంలో మొత్తం 1153 ఓట్లకు గాను 1036 (89.85శాతం) మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. పెందుర్తి పరిధిలో 863/954 (90.46శాతం), సబ్బవరం మండలంలో 93/94 (98.94శాతం), పరవాడలో 80/84 (95.24శాతం) పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.



పరవాడ జెడ్పీ బాలికోన్నత పాఠశాల వద్ద పోలీసుల బందోబస్తు

**సజావుగా పోలింగ్ ప్రక్రియ**

పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రంగా రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ ఎం.ఆనంద్‌కుమార్, సహాయ రిటర్నింగ్ అధికారి, ఎంపీడీవో కె.వెంకట్రావు పర్యవేక్షణలో ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 4 గంటలకు ముగిసింది. మధ్యాహ్నం 12 గంటలకు దాదాపు సగం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

**కూటమి 'ప్రత్యేక' శిబిరం**

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా కూటమిలో విభేదాలు బయటపడిన సంగతి తెలిసిందే. పోలింగ్ రోజైన గురువారం కూడా దాన్ని కొనసాగిస్తూ పెందుర్తిలోని పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ, జనసేన నేతలు పాకలపాటి రఘువర్మకు మద్దతుగా రెండు శిబిరాలు ఏర్పాటు చేయగా, మరో అభ్యర్థి గాదె శ్రీనివాసులునాయుడుకు మద్దతుగా బీజేపీ ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసింది. ఆఖరి నిమిషంలో కూడా కూటమికి చెందిన టీడీపీ, జనసేన ప్రతినిధులు ఉపాధ్యాయులను మచ్చిక చేసుకునే ప్రయత్నం చేశారు. టీడీపీ, జనసేన శిబిరాల వద్ద ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, ఏపీ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జి, బీజేపీ శిబిరం వద్ద బీజేపీ నేత గొర్లె రామునాయుడు, పలు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉన్నారు. స్వతంత్ర అభ్యర్థులకు మద్దతుగా పోలింగ్ కేంద్రం వద్ద శిబిరాలు ఏర్పాటు చేసి ఉపాధ్యాయులను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు.

### నేడు 'ఆదర్శ్'లో సైన్స్ ఎగ్జిబిషన్

పెందుర్తి: జాతీయ సైన్స్ డే సందర్భంగా శుక్రవారం స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు కరస్పాండెంట్ టి.థియోఫిలాస్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సైన్స్ డేలో భాగంగా విద్యార్థులు తాము రూపొందించిన పలు ప్రాజెక్ట్‌ల్ని ప్రదర్శిస్తారన్నారు. అత్యుత్తమ ప్రాజెక్ట్‌లకు బహుమతులు అందించనున్నట్లు పేర్కొన్నారు.

### రోడ్డు మధ్య ఆగిన లారీ.. నిలిచిన ట్రాఫిక్

- రెండు గంటలపాటు నరకం చూసిన వాహనదారులు



యలమంచిలి–పరవాడ రహదారిలో నిలిచిన ట్రాఫిక్

పరవాడ: పరవాడ–యలమంచిలి రహదారిలో గురువారం మధ్యాహ్నం రెండు గంటల పాటు ట్రాఫిక్ నిలిచిపోవడంతో ప్రయాణికులు నరకయాతన అనుభవించారు. మహాశివరాత్రి అనంతరం ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీర ప్రాంతాల్లో పుణ్య స్నానాలు ఆచరించడానికి తరలివచ్చిన భక్తులు ఈ ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకుపోయి నానా అవస్థలు పడ్డారు. ఊటగెడ్డ కూడలిలో ఓ బొగ్గు లారీ మరమ్మతులకు గురై రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయింది. దీంతో పరవాడ, యలమంచిలి, గాజువాక, విశాఖపట్నం ప్రాంతాలకు రాకపోకలు సాగించాల్సిన ప్రయాణికులు, భక్తులు ఈ ట్రాఫిక్‌లో చిక్కుకుపోయారు. ఎట్టకేలకు పోలీసుల రంగ ప్రవేశం చేసి ట్రాఫిక్‌ను క్లియర్ చేయడంతో, ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.

## పుణ్య స్నానాలకు పోటెత్తిన భక్త జనం



ముత్యాలమ్మపాలెం తీరానికి పోటెత్తిన అశేష భక్త జన సందోహం



తీరంలో పుణ్య స్నానాలు ఆచరిస్తున్న భక్త జనం

- కిక్కిరిసిన ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీరప్రాంతాలు

పరవాడ: మహాశివరాత్రి ఉపవాసం, జాగరణ దీక్షల అనంతరం సముద్ర స్నానాలకు వచ్చే భక్తులతో ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీర ప్రాంతాలు పోటెత్తాయి. అనకాపల్లి, విశాఖ జిల్లాల నలుమూలల నుంచి అశేష జన సందోహం తరలివచ్చింది. గురువారం తెల్లవారు జాము నుంచి తీరాలకు చేరుకుని, పుణ్య స్నానాలు ఆచరించి సమీపంలోని మహాశివుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ధర్మకర్త వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బొంది అచ్చిబాబు ఆధ్వర్యంలో భక్తులకు సదుపాయాలు కల్పించారు. బుధవారం రాత్రి తీరంలో భక్తుల సౌకర్యార్థం పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. పరవాడ అడిషినల్ ఎస్పీ దేవప్రసాద్ ఆధ్వర్యంలో పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు పర్యవేక్షణలో తీరంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



మహాశివుడిని దర్శించుకుంటున్న పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, పార్టీ నేతలు



తీరంలో పోలీసు సిబ్బందికి సూచనలిస్తున్న సీఐ మల్లికార్జునరావు

**మహాశివుడి సన్నిధిలో అదీప్‌రాజ్**

పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తన అనుచర వర్గంతో ముత్యాలమ్మపాలెం తీరంలో కొలువుదీరిన మహాశివుడిని దర్శించుకుని, పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆయన వెంట రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, పరవాడ జెడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు, పార్టీ మండల అధ్యక్షుడు కోన రామారావు, వైస్ ఎంపీపీ బి.అప్పలరాజు, విశాఖ జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు కోడిగుడ్ల దేవిసాంబ, పార్టీ నేతలు కబడ్డి అప్పారావు, బొద్దపు చిన్నారావు, సబ్బవరపు ముత్యాలనాయుడు, వి.అప్పలరాజు, చిరికి దేముడు, చరణ్‌రాజ్, వినోద్‌కుమార్, చిన మసేను, నల్లమసేను, రాము తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.